క్లుప్తంగా

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ నామినేషన్



పెనుకొండ: మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9–30 గంటల అనంతరం పార్టీ కార్యాలయం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులతో కలసి వచ్చి ఆమె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తున్న దృశ్యం

అమరాపురం: ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఆలదపల్లి సర్పంచ్ గిరిజమ్మ, ఆమె భర్త ఈరన్నలు స్వంతంగా ట్యాంకర్ ఏర్పాటు చేయించి ఆలదపల్లి, కనకనపల్లి ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. గ్రామానికి వేసిన బోరుబావుల్లో నీరు రాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ఎస్సీ, బీసీ కాలనీలో తాగునీటిని ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారు.

బాధ్యతగా పనిచేయండి



ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

రొద్దం: ప్రతి క్షేత్రస్థాయి సహాయకుడు బాధ్యతగా పనిచేయాలని ఏపీడీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీపై పథకంపై సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఓవరాక్షన్

- పోలీసులతో వాగ్వాదం



రోడ్డుపై వాహనాన్ని నిలిపి ఉంచిన టీడీపీ నాయకుడు అంజినప్ప

పెనుకొండ: టీడీపీ నాయకుడు కొల్లకుంట అంజినప్ప ఓవర్షాన్ చేశారు. ఏకంగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకెళితే... టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సవితమ్మ బుధవారం నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సుమోలో వచ్చిన అంజినప్ప వాహనాన్ని పోలీసులు బీటీఆర్ కాలనీ సమీపంలో కరెంటు సబ్‌స్టేషన్ దగ్గర ఆపేశారు. అందరిలాగానే ఇక్కడే వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్లాలని సూచించారు. దీనికి ససేమిరా అన్న అంజినప్ప పోలీసులతో వాదనకు దిగారు. దీంతో వివాదం చినికి చినికి గాలివానలా మారింది. రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అంజినప్ప మాత్రం పట్టువీడకుండా సుమో దిగకుండా అలాగే కూర్చుకున్నాడు. ఆఖరికి పోలీసులు తన వాహనాన్ని అనుమతించరని గుర్తించిన అంజినప్ప వాహనాన్ని పార్కింగ్ చేయించి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. పోలీసుల పనితీరును పలువురు అభినందించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



పెద్దిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పరిగి: సంక్షేమ ప్రధాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మ గెలుపు కోసం ఆయా గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. గురువారం మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ నామినేషన్‌కు తరలిరావాలని సూచించారు.

పురం.. జనసంద్రం



హిందూపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయిన పరిగి రోడ్డు

- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక నామినేషన్
- ప్రజల కష్టాల్లో అండగా ఉంటా ఆశీర్వదించాలన్న దీపిక
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులతో 'పురం'లో సందడి

హిందూపురం: 'హిందూపురం నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తా.. ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తాను. మీ అందరి దీవెనలు అందించి అత్యధిక మెజార్టీ ఆశీర్వదించండి' అని హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టిఎస్.దీపిక అన్నారు. బుధవారం టీఎస్.దీపిక నామినేషన్ అట్టహాసంగా జరిగింది. భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో పట్టణం జనసముద్రాన్ని తలపించింది. హిందూపురం పట్టణంలో రహదారులన్నీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా అంబేడ్కర్‌సర్కిల్ నుంచి సూగురు రహదారి వరకూ వేల మంది కార్యకర్తలతో కిటకిటలాడింది. హిందూపురం మండలం, లేపాక్షి, చిలమత్తూరు, మున్సిపాల్టీలోని వివిధ వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పట్టణ రహదారులు జనంతో నిండిపోవడంతో లేపాక్షి రహదారి, తూమకుంట, మణేసముద్రం, కొట్నూరు రహదారులు మీదుగా జనం రాకుండా పోలీసులు ఎక్కడిక్కడ కట్టడిచేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ఉదయం 9 గంటలకు సూగురు నుంచి ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి బయలు దేరారు. వేలాది మంది కార్యకర్తల నడుమ అంబేడ్కర్‌సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. దారి గుండా పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు దీపికకు హారతులిస్తూ బొట్టుపెట్టి ఆశీర్వదించారు. దారి పొడవునా అభిమానులు జగనన్న పాటలకు నృత్యాలు చేస్తూ ఉప్పొంగిన ఉత్సాహంతో సాగారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

ఇన్నాళ్లూ హిందూపురంలో టీడీపీ వాళ్లే ఎమ్మెల్యేలుగా గెలుస్తూ వచ్చినా ఏఅభివృద్ధి చేయలేకపోయారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక విమర్శించారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతో పురం అభివృద్ధికి అడుగులు పడటం ఖాయమన్నారు. ఎన్నికలు వస్తే అలావచ్చి ఇలా చేతులూపి వెళ్లిపోయే సినిమా ఆర్టిస్టులం కాదని, నిత్యం ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలోనే హిందూపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వలివేటి రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్నాళ్లూ ఎమ్మెల్యే వస్తాడని ఎదురుచూపులు చూసేవాళ్లమని, ఇకపై ఆ అవసరం లేదన్నారు. ఏకష్టమొచ్చినా మీ ఇంటిగా ఆడపడుచు టిఎస్.దీపిక తోడుగా నిలుస్తారని చెప్పారు.



సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న దీపిక దంపతులు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

నామినేషన్‌కు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్ దీపిక నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండలం నుంచి 100 బస్సులు, ఇతర వాహనాల్లో బుధవారం ఉదయం హిందూపురానికి తరలివెళ్లారు.

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక నామినేషన్‌కు లేపాక్షి మండలం నుంచి బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ప్రతి పంచాయతీ నుంచి ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి, సర్పంచులు ఆదినారాయణ, అశ్వత్థనారాయణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి, మసీదు, ఆలయాల్లో పూజలు

నామినేషన్ సందర్భంగా బుధవారం ఉదయమే హిందూపురంలోని చర్చి, మసీదు తర్వాత సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రత్యేక ప్రార్ధనలు, పూజలు చేశారు. రాజకీయ పోరాటంలో దైవ ఆశీర్వదం, దీవెనలు ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు టీఎస్ దీపిక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి ఇంత పెద్ద ఎత్తున తరలిరావడం హర్షణీయమన్నారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికల ప్రచారం నిర్వహించి తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మ విజయానికి కృషి చేయాలన్నారు.



లేపాక్షి: నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్తున్న నాయకులు



చిలమత్తూరు నుంచి నామినేషన్‌కు తరలివెళ్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ గెలుపే అందరి లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



గుణేమోరుబాగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. మండలంలోని గుణేమోరుబాగల్, ఆచారపాళ్యం, నాచేపల్లి, వీరజ్జిపల్లి, మోరుబాగల్, బాలేపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఈరలక్కప్ప బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలత వీరజ్జిపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్ననే ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈరలక్కప్పను, ఎంపీ అభ్యర్థిగా శాంతమ్మ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు బసవరాజు, నరసింహమూర్తి, చంద్రకళ వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ కొంకల్లు శివకుమార్, ఎంపీటీసీ సభ్యుడు కాడప్ప, సర్పంచులు తిప్పేస్వామి, రంగస్వామి, వైస్ సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ నాగరాజు గుప్త, నాయకులు డీలర్ రాజన్న, పరమేష్, శేఖర్, రంగనాథ, ఈరన్న, షణ్ముక, భూతన్న, అశ్వత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మడకశిరలో 10 నామినేషన్ల దాఖలు

మడకశిర: మడకశిర అసెంబ్లీ స్థానానికి బుధవారం 10 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప తరుపున మరోసెట్ నామినేషన్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివవకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తదితరులు దాఖలు చేశారు. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థులుగా ఎం లక్ష్మీనరసప్ప, జగన్నాథ్‌ప్రసాద్, హళ్లికెర ప్రియాంక, కడమనె రవీంద్ర, ఎస్ నరసింహమూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థిగా కే సుధాకర్, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా అంజినప్పగారి కృష్ణ, బీఎస్పీ అభ్యర్థిగా డీ ఇందివర్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా ఎంఎస్ రాజు నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్‌కు నేడు ఆఖరి రోజు

నామినేషన్ల దాఖలుకు గురువారం ఆఖరి రోజని ఆర్‌ఓ గౌరీశంకర్‌రావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు వేయడానికి సమయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు గుర్తించాలని ఆయన కోరారు.

పెనుకొండలో నాలుగు...

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సవితమ్మ, కాంగ్రెస్ తరపున బోయ నరసింహప్ప, స్వతంత్ర అభ్యర్థిగా హబీబ్, బీఎస్పీ తరపున ఆదినారాయణ మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

హిందూపురంలో ఐదు...

హిందూపురం: నామినేషన్ల స్వీకరణలో భాగంగా బుధవారం హిందూపురంలో ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. తహసీల్దార్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఆర్‌ఓ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్లు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టీఎస్.దీపిక నామినేషన్ దాఖలు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి కూడా నామినేషన్ వేశారు. కాగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ తరుపున రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వెంకటేష్‌రెడ్డి నామినేషన్ వేశారు. డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



మడకశిర: పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు



హెచ్‌ఆర్ పాళ్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మడకశిరరూరల్: పట్టణంలోని 14, 16 వార్డులకు చెందిన 10 కుటుంబాలు బుధవారం టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ చౌడరెడ్డి, నాయకులు రఘునాథ్, బాలకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని హెచ్ ఆర్.పాళ్యం గ్రామానికి చెందిన ఓబన్న, బాలయ్య, మంజునాథ, అశోక్, రామంజప్పతో పాటు 15 కుటుంబాలు బుధవారం రాత్రి ఎంపీపీ కవిత ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి వైఎస్.గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తాలుకా బీసీ సెల్ నాయకులు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు మడకశిరలో ఎన్నికల ప్రచారం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 10, 11వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెనుకొండ మండలం నుంచి పుట్టపర్తికి బుధవారం తరలివెళ్లారు. మునిమడుగు, చిన్నపరెడ్డిపల్లి, అమ్మవారిపల్లి, వెంకటగిరిపాళ్యం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ రాము, కృష్ణారెడ్డి, గోవిందప్ప, ఆదినారాయణ, వీరనారాయణ, ఆదెప్ప, మాధవచారి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు అందరూ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థినికి అభినందన

లేపాక్షి: పదో తరగతి ఫలితాల్లో 555 మార్కులు సాధించిన చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పరపల్లికి చెందిన హిమబిందును బుధవారం ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఇంత వరకూ తమ గ్రామంలో అత్యధికంగా మార్కులు సాధించవారు లేరని, హిమబిందును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మహేష్ , విద్యార్థిని తల్లిదండ్రులు శైలజ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లేపాక్షిని సందర్శించిన ధర్మస్థలం అధికారులు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయాన్ని కర్ణాటకలోని ధర్మస్థలం దేవాలయం గ్రామీణాభివృద్ధి సేవా సంస్థకు చెందిన సీఈఓ ఎల్‌హెచ్ మంజునాథ్, రీజనల్ డైరెక్టర్ శీనప్ప, ప్రశాంత్ తదితరులు బుధవారం సందర్శించారు. దేవాలయానికి సంబంధించిన విషయాలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ,

కర్ణాటక మద్యం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం రత్నగిరి చెందిన హనుమంతరాయప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం 10 ప్యాకెట్లు తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సమీపాన కర్ణాటక ప్రాంతం హొసకెర నుంచి కాలినడకన తీసుకొస్తుండగా పరిశీలించామన్నారు. అతని వద్ద 10 (90ఎంఎల్) కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. హనుమంతరాయప్పపై కేసు నమోదు చేశామని చెప్పారు.

మడకశిరలో పోలీసుల కవాతు

మడకశిర: పట్టణంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఈ కవాతు సాగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. బీఎస్ఎఫ్ దళాలు, స్థానిక పోలీసులు కవాతులో పాల్గొన్నారు. స్థానిక రూరల్ సీఐ రాజ్‌కుమార్, అర్బన్ సీఐ మనోహర్, ఐదు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పావగడ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈనెల 26న చిత్రదుర్గం స్థానం పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ఎన్నికల అధికారి, తహసీల్దార్ సంతోష్ కుమార్ తెలిపారు. తాలూకా వ్యాప్తంగా 246 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు ఆరుగురు చొప్పున ఎన్నికల అధికారులు ఉంటారన్నారు. 25 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. తాలూకా వ్యాప్తంగా 1,97,548 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సివిల్ పోలీసులు 100 మంది, 150 మంది రిజర్వ్ పోలీసులు, 80 మంది రైల్వే పోలీసులు, ఒక కేఎస్ఆర్‌పీ బెటాలియన్, 500 మంది మిలిటరీ పోలీసులు, ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్ఐలు బందోబస్తుగా ఉంటారన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

పావగడ: అబద్దాల హామీలు గుప్పించి ఒక్కటి కూడా నెరవేర్చని మతోన్మాద బీజేపీని ఓడించి గుణపాఠం చెప్పాలని తుమకూరు జిల్లా సీపీఐ కార్యదర్శి గిరీశ్ పిలుపు నిచ్చారు. బుధవారం పావగడలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బీఎన్ చంద్రప్పకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా సీపీఐ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం





అలంకరణలో రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి , జ్యోతులను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రత్నగిరితో పాటు గుడ్డగుర్కి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి కూడా గ్రామస్తులు జ్యోతుల ఉత్సవాన్ని జరిపారు. బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. మరోవైపు గురువారం హెచ్‌ఎం పల్లి, టీడీ పల్లి, వన్నారనపల్లి, హులికుంట, బాజయ్యపాళ్యం, కొత్తపాళ్యం, కొడగార్లగుట్ట, దానప్పపాళ్యం, జీఎస్ పాళ్యం, వన్నప్పపాళ్యం, అలుపనపల్లి, ఏ.గొల్లహట్టి తదితర గ్రామాల్లో జ్యోతుల ఉత్సవాలను నిర్వహించనున్నారు.

వైభవంగా దీపోత్సవం



దీపోత్సవానికి తరలివచ్చిన భక్తులు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో జరుగుతున్న సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆది ఆంధ్ర భక్తుడి అద్భుత దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. దీపోత్సవ వేడుకను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి మోహిని అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు. సర్పంచ్ గిరిజమ్మ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి అర్చకులు పాల్గొన్నారు.